# అనామిక

వెంకటరత్నంగారి ఊర్మిళ జిల్లా మొత్తానికి మొదటిదానిగా పాసయిందన్న వార్త ఊరంతా పాకింది. పది ఎకరాల ఆసామి వెంకటరత్నం. అతనికి ఒక్కగానొక్క అమ్మాయి ఊర్మిళ.

ఊరందరూ వచ్చి వెంకటరత్నాన్నీ, ఊర్మిళనీ అభినందించేవారే!

అప్పుడే చుట్టపు చూపుగా వచ్చిన వెంకటరత్నం పినతండ్రి కొడుకు వీరేశ్వరరావు అడిగాడు. "ఊర్మిళని ఏం చేస్తావు?"

వెంకటరత్నం ఆశ్చర్యంగా చూశాడు. "ఏం చెయ్యడమేమిటి? ఈ రోజుల్లో ఆడపిల్లలూ, మగపిల్లలూ సమానమే. నాకు ఉన్నది కొడుకైనా, కూతురైనా ఊర్మిళ ఒక్కతే. పక్క ఊరి కాలేజిలో ఇంటర్మీడియట్‌లో చేరుస్తాను."

వీరేశ్వరరావు మందహాసం చేశాడు. "అక్కడే పప్పులో కాలేస్తున్నావు. అంత బ్రిలియంట్ అమ్మాయిని పల్లెటూరిలో ఉంచి చదివిస్తావా? సిటీలో చదివించాలి. అమ్మాయి ఏ డాక్టరో, ఇంజనీరో అయితే బావుంటుంది. కానీ మామూలు డిగ్రీ ఏమిటి?"

"ఇక్కడ ఇంటర్మీడియట్ చదివీ డాక్టరవచ్చుకదా?"

"కాంపిటీషన్ ఎంత టఫ్‌గా ఉందో నీకు తెలియదు. అసలే మనది వెనుకబడిన జిల్లా, ఇక్కడ ఫస్ట్ వస్తే చాలదు. సిటీలో వాళ్లతో పోటీ పడాలి."

"అమ్మాయిని ఇప్పటి నుంచే హాస్టల్లో ఉంచడమా?"

"హాస్టల్లో ఉంచడమెందుకు? నువ్వే కాపురం అక్కడికి మార్చవచ్చుగా. నీకు ఉన్నదా ఒక్క కూతురు. ఆస్తి మొత్తం ఎలాగూ అమ్మాయికే ఇస్తావు. చదువుకున్న పిల్ల పల్లెటూళ్లో భూములేం చేసుకుంటుంది. సిటీలో ఇళ్లమీద పెట్టు. నీకూ అద్దెలు బాగా వస్తాయి. అమ్మాయి చదువూ బాగా సాగుతుంది."

వెంకటరత్నానికి అతని సలహా నచ్చింది. భూముల మీద ఆదాయం నికరం కాదు. తనకీ ఓపిక తగ్గుతోంది. చదువుకున్న అమ్మాయీ, అల్లుడూ పల్లెటూళ్లో ఉండరు కదా.

ఊర్మిళని సిటీలో కాలేజిలో చేర్చాడు వెంకటరత్నం. అదృష్టవశాత్తూ భూమి

అమ్మకమూ, ఇళ్ల కొనుగోలూ తొందరగా అయిపోయాయి. భూమి మీద కన్నా ఇళ్లమీద ఆదాయం ఎక్కువ రావడంతో అతనికి హాయిగా ఉంది.

ఊర్మిళ కాలేజీకి వెళ్లివస్తోంది. చాలా తెలివైన పిల్ల. కానీ పల్లెలో ఆమె ఒక్కర్తే తెలివైన పిల్ల. సిటీలో, కాలేజీలో అలా కాదు. చాలా మంది పిల్లలు బాగా చదువుతారు. ఊర్మిళకి ఎన్ని మంచి మార్కులు వచ్చినా తృప్తిగా లేదు. క్లాస్ ఫస్ట్ అన్నమాట ఎప్పుడూ తనకే ఉండడం అలవాటయిన ఆమెకు కాలేజీలో నలుగురిలో ఒకర్తెగా ఉండడం అసంతృప్తిగా ఉంది. తనకి ప్రత్యేకమైన పేరు ఉండాలన్నది ఆమె కోరిక. "వెంకటరత్నంగారి ఊర్మిళని చూసి బుద్ధి తెచ్చుకోండిరా" అనో, "ఊర్మిళలా చదవండి" అనో వినడం అలవాటయిన ఆమెకు తను నామరూపాలు నశించి అనామికగా మిగిలినట్లనిపించింది.

వెంకటరత్నం పరిస్థితీ అలాగే ఉంది. పల్లెటూళ్లో పదెకరాల ఆసామిగా అతనికో హోదా ఉండేది. రోడ్లో వెడుతూంటే నలుగురూ పలకరించేవారు. వర్షాల గురించీ, ఎరువుల సబ్సిడీ గురించీ, పురుగుల మందు చల్లడం గురించీ మాట్లాడుకునేవారు. పల్లెలో చాలామంది అతన్ని సలహా అడిగేవారు. ఇక్కడ ఏముంది? ఇంట్లో అద్దెకున్న వాళ్లు ఫస్టున అద్దె ఇచ్చేటప్పుడు తప్ప మొహమే చూపించరు. తనకంటూ ప్రత్యేకత ఏదీ?

ఊర్మిళ ఫస్ట్ ఇయర్ అయ్యేసరికి వెంకటరత్నంలో భావాలు రూపుదాల్చాయి. తనకి ప్రత్యేకమైన స్టేటస్ ఊర్మిళ స్టేట్ ఫస్ట్‌గా పాసయితేనే వస్తుంది. అతను కూతుర్ని పిలిచి తన మనస్సులోని మాట చెప్పాడు.

ఊర్మిళకి తండ్రి మాటలు నచ్చాయి. "అవున్నాన్నా! నాకూ స్టేట్ ఫస్ట్ రావాలనే ఉంది. పేపర్లో నా పేరూ, ఫోటో, వివరాలూ అన్నీ పడతాయి. ఊర్మిళ అంటే ఫలానా అమ్మాయి అన్న ప్రత్యేకత అప్పుడే నిలుస్తుంది. పేపర్లో నీ పేరూ పడుతుంది. నీకూ గొప్పగా ఉంటుంది."

తండ్రీ కూతుళ్లు కలలు కనసాగారు. ఊర్మిళ అహోరాత్రులు దీక్షగా చదివింది. స్టేట్ ఫస్ట్‌గా పేపర్లో పేరు పడాలి.

ఇంటర్మీడియట్ ఫలితాలు వచ్చాయి.

ఊర్మిళ స్టేట్ ఫస్ట్ రాలేదు. ఆమె పేరు పేపర్లో పడలేదు.

మర్నాటి పేపర్లో ఆమె పేరూ, ఫోటో, తండ్రి పేరూ పడ్డాయి. ఊర్మిళ ఫోటోకింద ఇలా రాసి ఉంది. "అమ్మా ఊర్మిళా! నీ కోసం మేము బెంగ పెట్టుకున్నాము. స్టేట్ ఫస్ట్

రాకపోయినా ఫరవాలేదు. నీ పేరు పేపర్లో రాకపోయినా ఫరవాలేదు. వెంటనే ఇంటికి రా."

పల్లెనుంచి పట్నం వచ్చిన వారికి ముందున్న ప్రత్యేకమైన హోదా పోతుంది. ఈ ప్రత్యేకత లేకపోవడానికి సైకాలజీలో అనామీ అంటారు పల్లెటూరి స్కూల్లో అతి తెలివైన విద్యార్థినిగా పేరు పొందిన ఊర్మిళ సిటీలోని కాలేజీలో నలుగురిలో ఒక్కర్తెగా ఉండలేకపోయింది. స్టేట్ ఫస్ట్‌గా ప్రత్యేకత నిలుపుకోవాలన్న ప్రయత్నం విఫలమైంది. ఇంట్లో నుంచి పారిపోయి ప్రత్యేకత నిలుపుకోవాలనుకుంది.

ఎప్పుడూ మొదటగా ఉండాలన్న కోరిక పిల్లలలో కలగనీయకూడదు.

(ఆంధ్రప్రభ వీక్లీ)